

# జాల్లి వాన

శ్రీసుభా

"అతనికేం లోటని వద్దంటున్నావే. యిలా యెన్ని సంబధాలు కాదంటావ్.' శాంతమ్మగారు బ్రతిమలాడ్డం మానేసి విసుగ్గా అంది.

'నాకిష్టంలేదు అమ్మా' ప్రేమ మరింత వోర్పుతో అంద.

'అదే - యెందుకు యిష్టంలేక పోవాలీ అని అడుగుతున్నాను'

'అది నా స్వవిషయం. యిష్టం లేదన్నాను, అంతే. నన్ను వదిలేయ్'

'నువ్వు స్వతంత్రురాలి వయిపోయావు, మరి'

'యిందులో స్వతంత్రం, బానిసత్వం, రెండూ లేవమ్మా.'

వాకిట్లో పడకుర్చీలో పడు

కున్న శేషయ్యగారు, భార్యకీ కూతురికీ జరుగుతున్న వాదోపవాదాలు వింటూనే వున్నారు. ఆయన్ని చూస్తే పాలసముద్రంలో ఆదిశేషు మీద పడుకునే విష్ణుమూర్తి మానవావతారం యెత్తి శేషయ్యగారిలా పుట్టాడనిపిస్తుంది. అంత ప్రశాంతంగా వున్నాడు. పాడులోకంలో మనుషులన్నవాళ్ళు పాపం తెగ మూటగట్టుకుంటేగాని శేషయ్యగారు విష్ణుమూర్తిలా చలించడేమో అన్పిస్తుంది. అంతకుముందే కొడుకు సాగరం, ప్రేమమీద నానా ధూంధాములు చేసి వెళ్ళాడు.

'అతనికేం లోటని వద్దంటున్నావే'

'లోటు వుంటేనే వద్దనాలా? పోనీ నాకు నచ్చక పోవడమే లోటు అనుకో.'

'అలాగే మాట్లాడుతూవుండు. మరో నాలుగేళ్ళుపోతే నువ్వు యెవరికీ నచ్చవ్. నిన్నూ యెవడూ చేసుకోడు.'

'అంతేకదా....'

సాగరానికి వుక్రోషం వచ్చింది. ఆడపిల్లకి పాతికేళ్ళు వచ్చినా పెళ్ళికాలేదంటే అదో డిస్‌క్వాలిఫికేషన్ తెలుసా.'

ప్రేమ అంత చిరాకులోనూ నవ్వేసింది 'పాతికేళ్ళ పెళ్ళికాని చెల్లెలువున్న అన్నగార్లకి కూడా వుండాలి, అ తలవంపు ధ్యాస'

'చదువుకున్నాననీ, ఉద్యోగం చేసుకుంటున్నాననీ నీకు తలబిరుసు'

'నీకు ఈర్ష్య అనినేనంటున్నాను.'

సాగరం చిత్తయిపోయాడు. 'ఛీ యీతప్పంతా నాన్నది. నీకు బాగా కొమ్ములు యిచ్చాడు.

శేషయ్యగారు పడక్కుర్చీలో కొద్దిగా కదిలాడు. ఇంతలో లోపలినుంచి విసవిసా సాగరం వచ్చి వోసారి తండ్రిని చూసి వీధిలోకి వెళ్లిపోయాడు. వెనకే శాంతమ్మవచ్చింది.

'మిమ్మల్నే దానికెలా నచ్చజెప్తారో మీా యిష్టం.'

'అదేం అంటుంది?'

'యేట్లో దూకుతుందిట'.

మరి నువ్వేమన్నావ్? నవ్వుతూనే అడిగాడు, ఆయన.

'అందరం కలిసే దూకుదాం అన్నాను' వినుగ్గా లోపలికి వెళ్ళిపోయింది.

• • •

పాతికేళ్ళు మీద పడుతున్న ప్రేమ తల్లిదండ్రులు తెచ్చిన సంబంధం వద్దని కాలదన్నడం వివేకులన్న వాళ్ళకి వింతగానూ, అవివేకులకి వేళాకోళంగానూ అనిపిస్తుంది నిజమే.

కానీ–మున్ఫైయేళ్ళుగా ఉద్యోగం చేస్తూ కూడా నెలనెలా అప్పులమీాద

యిల్లు నడుపుతున్న వో తరహా మనుషులకి వారసుడు శేషయ్య. పిల్లలు పుట్టుకొచ్చిన రేషియోలో కిందా మీదా పడి ప్రమోషన్లు అతి సులువుగా సంపాదించలేని అసమర్థుల్లకి అసమర్థుడు శేషయ్య. అటు సంఘంలోనూ, ఇటు ఆఫీసులోనూ, స్నేహితులన్నవాళ్ళు, కాదు కాళ్ళూ, చేతులూ, నోరూ ఉన్న జీవాలన్నీ లంచాలు మరగడం నేర్చి తద్వారా యిళ్ళు కట్టి, కూతుళ్ళకి ఘనాతిఘనంగా పెళ్ళిళ్ళు చేస్తూ, కొడుకులని విదేశాలకి పంపిస్తున్నారని తెలిసి నీతి బురఖా కప్పుకున్న అయోమయుడు ఆయన. సంఘం తొంభై తొమ్మిది పాళ్ళు గరిమనాభి తప్పి వక్రగతిలో తిరుగుతోందని తెలిసీ - దేశాభివృద్ధిమీదా, మనిషి విలువమీదా వంద పాళ్ళ నమ్మకం వదులుకోలేని ఆశాజీవి ఆయనగారు.

'కుళ్ళుకొచ్చిన పండు కుళ్ళి తీరవల్సిందే. మరో దారిలేదు. లేత పిందెలు దొరకొచ్చే రోజూ - అవి పరిశుభ్రంగా పండుకువచ్చే దశ కూడా వుంటుంది. మన దేశంలో పెద్ద మార్పు రావల్సివుంది కాబట్టే మనం అవినీతిలో శిఖరాగ్రాలని అందుకోవాలని ప్రయత్నం చేస్తూ వున్నాం. ద్వేషంతో ఈర్ష్యతో మనిషి మనిషిని మిగలకుండా చేసే రోజుకూడా వస్తేగాని - యీ తిక్కతనం పోదు .... అలాంటప్పుడు నాలాంటి వాళ్ళ అవసరం యీ సోసైటీకి చాలా వుంటుంది' నవ్వుతూ అనేవాడు శేషయ్య. ఆయనమాటల్లో అతిశయం ఎక్కడా కన్పడేదికాదు. పైగా ఫ్యూచర్ని ప్రిడిక్టు చేస్తూన్న జ్యోతిష్కుడిలా తో చెవాడు, వింటున్న వాళ్ళకి.

'చేతులు ముడుచుకుని కూర్చునే నీలాంటి వాళ్ళవల్లేం కాదు. జనం ఆయుధాలు పట్టాలి. అప్పుడే యే మార్పయినా వచ్చేది....' స్నేహితులు అనేవారు.

'మనజాతికీ, ఆయుధ సంఘర్షణకీ చుక్కెదురు. యిక్కడ యూరప్ దేశాల సామ్యం తేవద్దు.

'యెందుకట....'

'రక్తసంబంధాలతో, స్వార్థంతో మనం ముళ్ళువేసుకుని వున్నాం. దేవుడ్ని అవసరానికి వుపయోగించుకొని - ఆ అవసరం తీరాకా రచ్చకీడుస్తాం. నిజాయితీ మన్నుకైనా లేనిమనిషి తుపాకీ ధరించడానికి కూడా అనర్హుడు. వాడి నోటినుంచి విప్లవం చొంగరూపంలో బయట పడుతుందిగానీ - చేతిలో తుపాకీ నుంచి బులెట్ అడుగు దూరంకూడా దూకదు....'

'అయితే దారి....'

'ముందు మన నమ్మకాలు మారాలి. జీవనవిధానం మారాలి. అందుకు మంది కృషిచేయాలోయ్ పంతులూ .... మడి బట్టలు విప్పేసి మంచిబట్టలు కట్టుకోవడం నేర్చుకోండి. వీధిలో అవినీతిని కాదోయ్, యింట్లో కుళ్ళు పేరుకోకుండా చూసుకోండి. దేశాన్ని ప్రేమించడం తర్వాత విషయం, ముందు పక్కవాణ్ణి ద్వేషించడం మానండి.'

మిత్రులు చప్పట్లు కొట్టారు' శేషయ్య మాటల్లోవున్న వాస్తవం కాస్తా ఆ క్లబ్బులోవున్న నలుగురు చెవినీ పడకుండా ఆ చప్పట్లు బాగా సహాకరించాయి.


* * *

సాగరానికి రెండు రోజులుగా రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదు. అంత క్రితం అతనికి పగలూ రాత్రీ తేడా తెలిసేది కాదు. లోకంలో బోల్డు దుఃఖం ఆవేదనా ఉంటాయంటే అతను నమ్మేవాడు కాదు. పైగా కొట్టి పారేశేవాడు. అలాంటిది విశాల ఆకబురు కాస్తా అతని చెవిని వేసినప్పటినుంచీ సాగరం కల్లోల సాగరమే అయిపోయాడు. రెండేళ్ల పరిచయం ప్రేమగా మార్చుకుని, రకరకాల అనుభవాల్ని విశాలతో పంచుకుంటోనప్పుడు అతనికి తనది గానీ, విశాలది గానీ భవిష్యత్తులు గుర్తుకు రాలేదు. మొదట విశాల అతనిదృష్టిలో వొట్టిస్నేహితురాలు. ఆ స్నేహం ముదిరి విశాల దగ్గరవుతూంటే అతనికి ఆ యాచితంగా లభించిన వస్తువుగా మాత్రమే కనబడింది విశాల.

అయితే ప్రకృతిలో యే రెండు జీవులు కలుసుకున్నా తత్కారణంగా ఉత్పత్తి జరుగుతూనే ఉంటుంది. చెట్లు యెదిగి పువ్వులు పూసి పిందెలు వేస్తాయి. జంతువులు కీచులాడుకునీ కామించుకునీ దగ్గరవుతాయి. అందుకు ప్రతిగా లోకంలో కొత్త అందాలసృష్టి జరుగుతుంది. అంతేగాని వాటి ఉనికికి అంతగా ప్రమాదం ఉండదు.

కాని వో ఆడపిల్ల పెళ్ళికాకుండా గర్భం దాలిస్తే లోకంలో కావల్సినంత కీచులాట మొదలవుతుంది. ఘోర ప్రమాదం యేదో జరిగిపోయినట్టు మనుషులంతా కిందా మీదా పడతారు. ఇదంతా నీతికి సంబంధించిన విషయం అనీ, కట్టుబాట్లని అతిక్రమించడంఅనీపెద్దలూకోర్టులూ కోరలు విప్పుకొని వాగ్మాలాలు వప్పగించడం జరుగుతుంది.

విశాల తనకి నెల తప్పిందని చెప్పడంతో సాగరం అదే స్థితిలోకి జారి ఆలోచించడం మొదలుపెట్టాడు అతనికి విశాల ప్రియురాలిగా




కన్పడ్డం మానేసి కండకావరంతో బలిసిన బజారు మనిషిలా తోచింది.

'అరెరే' అన్నాడు.

'కంగారు పడుతున్నావా' అంది ముద్దుగా విశాల.

'ఇప్పు డెలా, నాకంతా అయోమయంగా వుంది' అన్నాడు.

'కొద్ది రోజుల్లో తండ్రివి కాబోతున్న నువ్వు - చంటిపిల్లాడిలా యేవిటిదీ' అంది.

'తండ్రా' అన్నాడు.

'అవును....యెక్కడో ఆలోచిస్తూ ఆ పరాకేమిటి బాబూ' చిరుకోపంతో అంది విశాల.

సాగరం కళ్ళుమూసుకుని ఆలోచనలో పడ్డాడు.

'మాట్లాడబ్బా- నాకు భయంగా వుంది' అంది అతని భుజంమీద తల వాల్చి, విశాల.

సాగరం దొంగలా నేలచూపులు చూస్తూ అన్నాడు. 'విశాలా ఎందుకైనా మంచిది, నువ్వు అబార్షన్ చేయించుకో'

ఆ మాటతో విశాలకి నెత్తిమీద మోదినట్టయ్యింది. బొమ్మలా సాగరాన్ని గుడ్లు తేలేసి చూసింది.

'నిజంగా చెప్తున్నాను'

ఛీ పోండు. నాకెందుకు భయం. నేనేం కానిపని చేయలేదే'

'మనిద్దరం పొరపాటు పడ్డాం.'

'పొరబాటు అనకు, కొంచెం కంగారుపడ్డాం అను' అతన్ని మార్చే ప్రయత్నంలో అంది.

'కంగారు పడ్డాం, అంటే నలుగురూ నవ్వుతారు

'మీవాళ్ళూ మావాళ్ళూ కూక లేస్తారనేగా. వాళ్ళు మన్నిస్తాం అంటే వాళ్లు యేదనమంటే అమాటే అందాం'

'నీకు తెలియదు విశాలా' మరో దారి లేదు'

'దగ్గరదారి - పెళ్ళి వొకటే'

'పెళ్ళా'

'పోనీ రిజిస్టర్ మేరేజ్.'

'యింట్లో యెలా చెప్పాలి. యింట్లో యెలా చెప్పాలి' గొణుక్కుంటున్నాడు సాగరం.

మగవాడివి, నీకేం భయం - అనాలనుకుంది విశాల. మనం ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకుందాం అనుకున్నాం, అందుకు ప్రతిఫలంగా పెళ్ళికిముందే మనల్ని వొరూపు దిద్దుకుంటూవున్న ఆకృతి హెచ్చరిస్తోంది. తప్పేమిటిట- అని నచ్చజెప్పాలనుకుంది. యింట్లోవాళ్లు కాదంటే మనం బ్రతకలేమా ఇంత లోకంలో - అని ధైర్యం అందివ్వాలనుకుంది. పిరికివాడిలా అలా మూగనోము పట్టావేమిటి - అని నవ్వించాలనుకుంది, కవ్వించాలనుకుంది.

కానీ విశాలకి నోరు మెదిపే సావకాశం యివ్వకుండా రాయిలా వుండిపోయాడు, సాగరం.

నువ్వు నా స్నేహితురాలివి మాత్రమే, విశాలా - అనాలనుకున్నాడు సాగరం. మనం కొంత విచ్చలవిడి తనంతో ప్రవర్తించాం- పొరబాటయ్యింది అని నచ్చజెప్పాలనుకున్నాడు. అంతమాత్రానా పెళ్లి ఆ పొరబాటుకి పరిష్కారం కాదు అని నమ్మించాలనుకున్నాడు. కానీ నిర్మలంగావున్న విశాలని చూస్తూ ఆ మాటలు సాగరం చెప్పలేదు.

అందుకే సాగరం కళ్ళకి విశాల పిశాచంలా కన్పిస్తోంది.

* * *

యీ లోకంలో ప్రేమించుకోవడం చాలా తేలిక. కానీ ఆ ప్రేమ ఫలించాలంటే మాత్రం చాలాజాగ్రత్తలు తీసుకోవల్సి వుంటుంది. మొదటిది, ప్రేమించేవాళ్లూ ప్రేమకు నోచుకునేవాళ్ళూ నిజాయితీ పరులవ్వాలి. రెండోది ధైర్యవంతులవ్వాలి. అయితే యేవేవో అడ్డంకులవల్ల ప్రేమ అగ్నిపరీక్షల పాలవుతూనే వుంటుంది. లెఖకుమించి అపజయాలే యెదురవుతాయి.

స్త్రీకారణంగా ప్రేమ విఫలమయినప్పుడు మగవాడయితే వ్యధచెంది పిచ్చివాడవుతాడు. సంఘం కూడా అతని కర్మకి అతన్ని వదిలేసి మర్చిపోతుంది. అంతవరకే. కానీ అదే మగవాడు దగాచేస్తే, ఆడదానికి దారులన్నీ మూసుకుపోయినట్టే లెఖ. గుండెల్లోనే బాధని దాచుకోవాలి.

నోరెత్తడానికి వీల్లేదు. చేతనైతే మరోజన్మమెత్తిన మనిషిలా జీవితంతో రాజీపడాలి. ఇక తట్టుకోలేని వాళ్ళయితే యేనుయ్యో గొయ్యో చూసుకోవాలి. మరో దారిలేదు. సాధారణంగా ప్రేమించి మోసపోయిన ఆడవాళ్ళందరికీ రెండో మార్గమే ముందుగా కన్పిస్తుంది. అందుకు కన్నవాళ్లూ స్నేహితులూ కూడా దోహదం చేస్తారు. చచ్చేవరకూ సాధిస్తారు. పరువు ముందు మనిషికి చిల్లిగవ్వ విలువ యివ్వని పరిస్థితులు చెల్లుబాటులో వున్నాయి....

తను తెచ్చిన సంబంధం ప్రేమ యెందుకు వద్దంటున్నదీ విని శేషయ్యగారు మాన్పడిపోయాడు. మొదట నమ్మలేదు. శరీరంలో యెవరో కొరడాలు ఝుళిపిస్తోన్నట్టయ్యింది.

'ఫరవాలేదు నువ్వుమాత్రం బాధపడకు, లోపలికి వెళ్ళు. అంతా నే చూస్తాను' అని ప్రేమని పంపేసి వాకిట్లో అటూ యిటూ తిరగడం మొదలుపెట్టాడు.

గోడమీద ఫొటోల్లో వున్న తల్లిదండ్రులు, బంధువులు, సీతారాములు, శ్రీకృష్ణుడు, ఈశ్వరుడు ప్రత్యక్షులుగా నిలబడి తన నిర్ణయం కోసం యెదురు చూస్తున్నట్టు అన్పించింది.

సంవత్సరాలుగా సాంప్రదాయానికీ, కట్టుబాట్లకీ పేరెన్నికగన్న కుటుంబం ఆయనది. మనిషిహద్దులో వుండి బ్రతుకు సాగిస్తే వచ్చే లాభాలేమిటో తెలుసు. కుటుంబంలో వొక్క వ్యక్తి మెట్టు దిగి నడిస్తే, కాలు జారి ప్రవర్తిస్తే తీసుకోవల్సిన జాగ్రత్త లెటువంటివో, వేయవల్సిన శిక్ష యెటువంటిదో కూడా తెలుసు.

శేషయ్య తాతగారు సుబ్బరామయ్య విధవ చెల్లెలు రాత్రిపూట అన్నం తిని తాంబూలం వేసుకున్నందుకు, మరోరోజు రంగు చీర కట్టుకున్నందుకు వారంరోజులు ఆమెని పస్తులు పడుకోబెట్టిన మనిషి. ఇంట్లో ఆడవాళ్ళు వీధిగుమ్మందాటితే పాలంనుంచే పసిగట్టి పొలికేకలు పెట్టెవాడు. అంతటి అహంకారి ఆయన.

ఇక తండ్రి రక్తం పంచుకుని పుట్టిన కూతురు లక్ష్మి కాలు జారిందని తెలిసి యింట్లో పెళ్ళాంమీద రామరావణ యుద్ధం ప్రకటించాడు. తర్వాత కూతుర్ని పేక బెత్తంతో చావ మోదాడు. వీధిలో నలుగురికీ తెలిస్తే యేమవుతుందోనన్న బెంగతో మంచం పట్టాడు. ఆఖరికి దగ్గరబంధువులసలహామీద కాశీయాత్ర మిష పెట్టుకుని అర్నెల్లు కూతురితో అక్కడేవుండిపోయాడు. పసిగుడ్డుని

గంగామాతకి అర్పించి, ఆపైన పుణ్యం మూట గట్టుకొనిగాని ఇంటికి తిరిగి రాలేదు.

శేషయ్య కళ్ళ ముందు లక్ష్మి మొహం కదులాడింది. ఇరవైయేళ్లు రాకుండానే జీవితం చిరిగిన విస్తరి అయి – యేడవడానికి కూడా అర్హత లేకుండా మూలగదిలో పడుండేది. అఖరికి వో రోజు నూనే నల్లమందూ తాగి లోకంనుంచి నిష్క్రమించింది. అంతే వారానికి తండ్రి మంచంమీద నుంచిలేచి ఆరోగ్యంవుంజుకున్నాడు. రెండు మూడు నెలల్లో మామూలు మనిషిగా తిరిగాడు. తనో కూతుర్ని కన్నసంగతీ, ఆకూతురి జీవితం తన చేతుల మీదుగానే మసిబారిన విషయం పూర్తిగా జరగనట్టే ప్రవర్తించేవాడు.

శేషయ్యగారు తను కూడా వోకానొక రోజు యిటువంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందని వూహించలేక పోయాడు.

అయితే కల్లో కూడా మనిషి పశువుగా మారి నికృష్టపుసన్ను చేయడం ఆయన వూహా కందని విషయం. మనిషి మనిషిని హెచ్చరించచ్చు. ఓదార్చవచ్చు. అంతేగాని శిక్షించే హక్కు లేదు. ఇవి ఆయన ఖచ్చితమైన వుద్దేశాలు.

కాసేపు ఆలోచించి. భార్యని పిలిచాడు.

'యేమిటీ' అంటూ లోపలినుంచి వచ్చింది శాంతమ్మ.

అలా కూర్చో చెబుతాను' అన్నాడు.

పడక్కుర్చీ పక్కన చతికిల బడింది ఆవిడ.

శేషయ్య తన తాతగారు చేసిన పన్లు, వాటిలో దోషభూయిష్టమైనవీ తండ్రిచేసిన పొరబాట్లూ ముఖ్యంగా లక్ష్మిపట్ల చూపిన నిర్దయా అన్నీ మళ్ళీవోసారి భార్యకి గుర్తుచేశాడు.

'ఆ గొడవలన్నీ యెందుకండీ, నాకు తెలియవనా? ఈ యింటి పద్ధతులూ' అంది.

'అయితే విను' అంటూ శేషయ్య మొదలుపెట్టాడు.

'వూ' అంటూ మొదలుపెట్టి 'అయ్యో' 'అయ్యో' అంటూ కంఠం మార్చుకొని ఆపైన యేడుపు ఆపుకోలేక 'రామ' 'రామ' అంటూ శోకాలు మొదలుపెట్టింది శాంతమ్మ.

'యేడ్చి మనం చేసేదేం లేదు.'

'అయితే ఎలా, అతగాడెవడండీ, మీరు వెళ్ళి వాళ్ల పెద్దవాళ్ళ కాళ్ళు పట్టుకోవాలేమో, చూడండి.'

'లాభం లేదు, అతగాడికి పెళ్ళి కూడా అయిపోయిందట.'

'ఛీ! యిదంతా మీవల్లే జరిగింది. దానికి చదువు, స్వేచ్ఛ, ఉద్యోగం అవన్నీ మీరు చేసిందే, దానికి పోయేకాలం వచ్చింది'.

'అవన్నీ తల్చుకుని ప్రయోజనం లేదు.'

'యెవడు చూసి చూసి దీన్ని చేసుకుంటాడు.' యేడుస్తోంది.

'యిప్పుడు దానికి పెళ్ళి కాదు ముఖ్యం. మనవైపునుంచి ధైర్యం, ఓదార్పు' శేషయ్య నిమ్మదిగా అన్నాడు.

'యెందుకు వోదార్చాలి. మన కడుపులో చిచ్చుపెట్టిందనా. నరికేయండి పీడాపోతుంది'

'చూడు....దాన్ని నువ్వేమనద్దు. అన్నీ నే చక్కబరుస్తాను. వెళ్ళి పడుకో.' శాంతమ్మ యేడుస్తూనే లోపలికి వెళ్ళిపోయింది.

మర్నాడు శేషయ్యగారు కూతురికి తన నిర్ణయాన్ని చెప్పాడు.

అంతావిని ప్రేమ భోరుమని యేడ్చేసింది.

'యేడవకు .... వెనక మానాన్న యిలాంటి స్థితిలో చాలా ఘోరంగా ప్రవర్తించాడు. అప్పటినుంచే కొడుకులమయిన మా సానుభూతి కూడా ఆయనకి దొరికేదికాదు. నా బిడ్డలు నాకు అటువంటి శిక్ష వేయడం నేను ఒప్పుకోను.'

ప్రేమ మాట్లాడలేకపోయింది.

'శీలంపోయిన ఆడదానికి చావు శరణ్యం కాదు. అది మన ఆర్య జీవన విధానంకూడా కాదు తెలుసా, ఓసారి ప్రేమనిచూసి తిరిగి చెప్పడం మొదలుపెట్టాడు.

'ప్రేమించిన వాడితో నీ జీవితం ముడివడే అవకాశం పోయింది.

అంతవరకే నువ్వు దురదృష్ట వంతురాలివి. అందుకే అతని అన వాలుని నీ శరీరంలోంచి చెరిపేసుకోవాలి'

'నాన్నా' అంది తలవంచుకునే ప్రేమ.

'ప్రేమా నువ్వు చదువుకున్న దానివి. మంచిచెడులు తెలుసు నీకు. మన తరాలమధ్య వైవిధ్యం వుంది. నేనే నా తరాన్ని యిప్పటికీ అసహ్యించుకుంటూ వుంటాను. అలాంటిదినువ్వేమిటి నా తరంలోకి వస్తానంటావ్....'

ప్రేమ జవాబు చెప్పలేదు. జ్వాలలా వెలిగిపోతున్న శేషయ్యగారనే వో విజ్ఞుడికి, ఆదర్శవాదికి కూతురుగా పుట్టినందుకు మొదటిసారి ప్రేమ గర్వపడింది.

'గవర్నమెంటు యెబార్షన్ లీగలైజ్ చేసింది నీలాంటి వాళ్ళకోసం కాదు ప్రేమా. నాలాంటితండ్రులూ, అన్నయ్యలాంటిమూర్ఖులూ నీలాంటి వాళ్ళ ప్రాణాలు తీయకుండా, కోరలు పీకి పారవేయడానికే!! కన్న

వాళ్ళకి ప్రేమించే హక్కుతప్ప శాసించే హక్కులేకుండా చెయ డానికే !!!

* * *

ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌నుంచి రమ్మనమని కబురు రావడంతో శేషయ్యగారు ఆశ్చర్యపోయాడు. అందులో అర్ధరాత్రి సమయం. ఆయన అంతకుముందే లేడీడాక్టర్‌తో మాట్లాడి వుంచాడు. ఫలానా రోజు ఆపరేషన్ చేస్తానని లేడీ డాక్టర్ చెప్పింది కూడా.

టాక్సీ డ్రైవర్‌తో 'యిప్పుడే బట్టలు మార్చుకుని వస్తాను' అనేసి సరాసరి ప్రేమ గదిదగ్గరికి వెళ్ళి రెండు మూడుసార్లు పిలిచాడు జవాబు రాలేదు.

'నేను ప్రేమా నాన్నని తలుపు తెరమ్మా' ఆతృతగా కేకేశాడు.

'యేం నాన్నా' అంటూ తలుపు తెరిచింది ప్రేమ

ప్రేమని చూసి ఆయన తేలిగ్గా నిట్టూర్చాడు. నిమ్మదిగా 'పీడకల వచ్చిందమ్మా..ఏం లేదులే, పడుకో' అనేసి భార్యనిలేపి ఆస్పిటల్‌కి వెడుతోన్న విషయం చెప్పి టాక్సీ యెక్కాడు.

హాస్పటలు గుమ్మంలోనే డాక్టరు ఇందుమతి టాక్సీకి యెదురొచ్చింది.

'రండి శేషయ్యగారూ, మీరు వూళ్ళో వున్నారో లేరోనని భయ పడ్డాను.'

'అర్ధరాత్రి కబురు చేశారు. యేమిటి విశేషం'

'లోపల కూర్చుని మాట్లాడు కుందాం, పదండి'

యిద్దరూ లోపలికి వెళ్ళారు.

శేషయ్యగారు కుర్చీలో కూర్చుంటో పక్క కుర్చీలోవున్న మనిషిని చూసి ఆశ్చర్యపోయాడు విశ్వనాథం. ప్రేమని చూసుకుందుకువచ్చిన పెళ్ళికొడుకు.

విశ్వనాథం శేషయ్యగారికి నమస్కారం చేశాడు-మౌనంగానే.

'ఇతను మీకు తెలుసుననుకుంటాను' ఇందుమతి అడిగింది.

శేషయ్యగారు వెంటనే యే సమాధానం చెప్పలేకపోయాడు. తల వంచుకునే 'కొద్దిగా తెలుసు' అన్నాడు.

'విశ్వనాథం, నువ్వు లోపలికి వెళ్ళికూర్చో. వీరితో నేను మాట్లాడతాను' అని ఇందుమతి అతన్ని లోపలికి పంపి.... 'యబార్షన్ కేసొకటి టేకప్ చేయవల్సి వచ్చింది. ఆ అమ్మాయి యితనికి వరసకి చెల్లెలవుతుంది. పెళ్ళి కాలేదు. చదువుకుంది. వెనక పోషించవల్సిన చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ వున్నారు....'

శేషయ్య వింటున్నాడు.

'ఆపరేషన్ కండక్టు చేసేదాన్నే. కానీ యెడ్వాన్స్‌డ్ ప్రెగ్నెన్సీ. అం

దుకే భయపడి వివరాలు అడిగి, నలహాలు చెప్పబోయాను.'

'వోహో....'.

'మీరుయేమీ అనుకోవద్దు శేషయ్యగారూ. రేపు మీరు ప్రేమకి కూడా ఆపరేషన్ చేయించా లనుకుంటున్నారు. మీధైర్యానికీ సాహసానికీ నేనే ఆశ్చర్య పోయాను. కానీ యీ అమ్మాయి బ్రతుకూ, బాగోగులూ మీచేతుల్లో ఉన్నాయి.'

శేషయ్యగారికి యేమీ అర్థం కాలేదు.

'ఆఅమ్మాయి వొకటే ఏడుస్తోంది. పైగా ఆ అమ్మాయికి యబార్షన్ యిష్టం లేదు. అందుకే నేనూ ఆ అబ్బాయీ బుజ్జగించి అడిగితే మీ అబ్బాయి పేరు చెప్పింది'.

'మా అబ్బాయి, సా గ ర మా' శేషయ్యగారు కుర్చీలోంచి లేచాడు కంగారుగా.

'విశ్వనాథం అడిగిన ప్రశ్నలన్నిటికీ ఆ అమ్మాయి సరిగ్గానే జవాబులు చెప్పింది.'

'అరే, నాకేమీ తెలియదండీ'.

'మీ అబ్బాయి మీకు భయపడి వుంటాడు' ఇందుమతి అంటోంది.

'నన్నేం చేయమంటా రిప్పుడు' అయోమయంగా అయిపోయాడు.

'విశ్వనాథం మీతో మాట్లాడతానన్నాడు. కావాలంటే ఆ అమ్మాయిని మీరు చూడచ్చు' అని నర్స్‌ని పిల్చి శేషయ్యగారిని లోపలికి పంపింది.

పక్కమీద పడుకున్న అమ్మాయి శేషయ్యగారికి వాడిపోయిన పువ్వులా కనబడింది.

శేషయ్యగారికి అంతా అర్థమయీ అర్థం కానట్టుగా వుంది. ఓదార్పూ సానుభూతీ అందివ్వలేని తన స్థితి గుర్తొచ్చి తలొంచుకున్నాడు. చేసిన తప్పు వొప్పుకుని కన్న కూతురు యెదురుగా నిలబడితే ధైర్యం అందించి లోకాన్నే ధిక్కరించగలనని గర్వపడ్డాడు. కానీ కొడుకు చేసిన వో నికృష్టమైన పనితో తిరిగి ఆయన నేరస్తుడవ్వాల్సి వచ్చింది.

డాక్టరమ్మ నాకంతా చెప్పింది. యీ సంగతులేమీ నాకు తెలియవు' అన్నాడు విశ్వనాథంతో.

'విశాలా, సాగరంవాళ్ళ నాన్నగారు వచ్చారు చూడమ్మా' అంటోంది తల్లి.

'ఒకసారి బయటకు వెడదాం, రా విశ్వనాథం' అన్నాడు శేషయ్య.

యిద్దరూ వరండాలోకి వెళ్లారు. శేషయ్య విశ్వనాథం రెడు చేతులూ పుచ్చుకుని యేదో చెప్పబోయాడు. విశ్వనాథం చేతిలో ఉత్తరాల కట్ట ఆయన చేతికి తగిలింది.

'నిజానిజాలు మీకు తెలియడం ముఖ్యం. ఇవి వాళ్ళిద్దరూ వ్రాసుకున్న ఉత్తరాలు' విశ్వనాథం నిమ్మదిగా అన్నాడు.

శేషయ్య విశ్వనాథం భుజంమీద చెయ్యివేసి 'నీ చెల్లెలికేం భయం లేదు. అమ్మాయిని యింటికి తీసుకు వె[illegible]ం వెళ్ళి టాక్సీ పిల్చుకురా.'

'[illegible]రి....' ఆశ్చర్యపోయాడు.

'[illegible]యేం భయంలేదు. వాడి మెడ [illegible]ంచి పెళ్ళిచేసే బాధ్యత నాదీ'

విశ్వనాథం కృతజ్ఞతతో శేషయ్య గారిని చూసి నమ్రతగా అన్నాడు, 'మీరు మేం కోరిన కట్నం యివ్వలేమని మా నాన్నకి వ్రాసిన ఉత్తరం నేను చూశాను. శేషయ్యగారూ మీరు యేమీ అనుకోనంటే చెప్తాను. మీ ప్రేమని నేను పెళ్ళి చేసుకుంటాను. యేది యేమైనాసరే మాటిస్తున్నాను'

శేషయ్యగారు ఆవేశంతో మాట్లాడుతున్న విశ్వనాథాన్ని చూస్తూ వుండిపోయాడు.

'మీరు మా చెల్లెలి బ్రతుకు నిలిపారు. అందుకు విశ్వాసం మాకు వుండితీరాలి... కనీసం మీతోపాటు మీ బరువుని మోయడం నాకర్తవ్యం అనుకుంటాను.'

శేషయ్యగారి కళ్ళ వెంబడి కన్నీళ్ళు జలజలా రాలాయి. కళ్ళు తుడుచుకుంటూ 'ప్రేమని పెళ్ళి చేసుకుంటానంటున్నావు కదూ' అన్నాడు, చంటిపిల్లాడిలా.

'అవును సార్....'

'కుదరదు నాయనా, అది జరిగే పనికాదు'

'మా వాళ్ళని వప్పించగలను,

గుండెల్లోంచి పొడుచుకు వచ్చే దుఃఖాన్ని ఆపుకుందుకు శేషయ్యగారు తెచ్చిపెట్టుకుని నవ్వి 'విశ్వనాథం, నీ చెల్లెలిపాటి అదృష్టవంతురాలు కాదు, ప్రేమ. దానికి నీలాంటి అన్నగారు లేదు. వుండి వుంటే నీలాగే వాడూ, దాని బ్రతుకు నలిగిపోకుండా కాపాడేవాడు. అప్పుడు నువ్విలా అడగవల్సి రావడం, నేను బాధపడ్డం రెండూ జరిగేవికావు.' శేషయ్యగారి మాటలు అర్థంకావడానికి చాలా సేపు పట్టింది, విశ్వనాథానికి.

• • •

తెలతెలవారుతూంటే వీధిగుమ్మం తుడిచి ముగ్గులు పెడుతున్న రంగమ్మ గుమ్మందగ్గర టాక్సీ ఆగడం; అందులోంచి జనం దిగడంచూసి గబగబా వాకిట్లోకి వెళ్ళి 'చిన బాబుగోరూ, నెగండీ సుట్టాలొచ్చినోరు' అంటూ సాగరాన్ని లేపింది.

ఆవలిస్తూ కళ్ళు నులుపుకుంటూ లేచి వీధిగుమ్మం దగ్గరికి వెళ్ళిన సాగరానికి మొదట విశాల కన్పడింది. అంతే ఆ వెనక వస్తున్న విశ్వనాథం, విశాలతల్లీ, కన్పడ్డం మానివేశారు.

వాకిట్లో జరుగుతున్న చప్పుళ్ళకి

లేచివచ్చిన ప్రేమకి మొదట విశ్వనాథం కన్పించాడు. ఆశ్చర్యంగా చూసింది.

'కంగారుపడకండి. మనంచుట్టాలం అయ్యాం' అన్నాడు చిరునవ్వు నవ్వుతూ... ఆపైన 'అది మాచెల్లెలు, మీ వదిన, ఆవిడ....' ప్రేమకీ అంతా కలగా వుంది. గబగబా వీధి గుమ్మం వైపు వెళ్ళింది.

అరుబయటే శేషయ్యగారు వుండిపోయారు. ఆకాశం నిండుగా దట్టంగా మబ్బులు పట్టివున్నాయి. శేషయ్యగారికి మనుషులపట్ల వున్న జాలికీ, కరుణకీ కరిగి ఆకాశం వర్షిస్తోందనట్టుగా వుండుండి చినుకులు పదుతున్నాయి. ప్రేమ గుమ్మంలోనే నుంచుని....

'నాన్నా వర్షం వస్తోంది లోపలికి రా' అని కేకేసింది.

'ప్రొద్దున్నే వచ్చే వర్షంవల్ల నష్టం లేదండీ. ప్రొద్దున్నే వచ్చిన చుట్టాలే ప్రమాదస్తులు అంటారు' అంటూ వెనకే వచ్చాడు విశ్వనాథం.

'నిజమే, నువ్వు చెప్పింది. వాళ్ళకి మర్యాదలు చేయి ప్రేమా, ఆ అమ్మాయేమో .... మీ వదిన .... ఆవిడేమో ....' శేషయ్యగారు చెప్తున్నారు....

'నేనెవరో చెప్పరేం సార్' అన్నాడు విశ్వనాథం హటాత్తుగా.

శేషయ్యా, ప్రేమాకూడా వింతగా చూశారు విశ్వనాథం వైపు.

యీసారి చినుకులు తొందర తొందరగాపడ్డం మొదలుపెట్టాయి. అవి విశ్వనాథం కోరికల్లా చిరుశబ్దం చేస్తున్నాయి....

శేషయ్యగారు చెప్పింది అర్థమయిన తర్వాతకూడా విశ్వనాథం ప్రేమపట్ల తన అభిప్రాయాన్ని మార్చుకోలేదన్న సంగతి వాళ్ళిద్దరికీ తెలియదు. తెలిసినప్పుడు యేమవుతుందన్న భయం కూడా అతనికి లేదు. యెందుచేతనంటే, ప్రళయం, పెనుతుఫానూ, రావడం వెళ్ళిపోవడంకూడా జరిగింది. యిక వచ్చేదీ మిగిలేదీ చిరుజల్లు మాత్రమే. అందులో యెంతసేపు తడిసినా భయం పుట్టదు. పైగా ఆనందంగా కూడా వుంటుంది.

